ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

బుధవారం 12 ఫిబ్రవరి 2025



నిధులను తాగుతున్న నీరు

- కదిరికి 70 కి.మీ. నుంచి సరఫరా
- 1000 హెచ్‌పీ సామర్థ్యం మోటార్ల వినియోగం
- నెలకు రూ.40 లక్షలకుపైగా విద్యుత్ బిల్లులు
- అభివృద్ధి నిధులు వెచ్చించినా రూ.80 కోట్ల బకాయి
- చెర్లోపల్లి డ్యాం నీరు తెస్తే.. భారీగా తగ్గనున్న భారం



చెర్లోపల్లి డ్యామ్

కదిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీపై తాగునీటి ఖర్చుల భారం మోయలేనంత పడుతోంది. తాగునీటి సరఫరా విద్యుత్ బిల్లులే నెలకు రూ.40 లక్షల దాకా వస్తున్నాయి. మున్సిపాలిటీకి వచ్చే నిధులన్నీ విద్యుత్ బిల్లులకే సరిపోతున్నాయి. అభివృద్ధి పనులకు పైసా మిగలడంలేదు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ సహా అన్ని రకాల పనులు ఏళ్లతరబడి ఎక్కడికక్కడ ఆగిపోయాయి. వైసీపీ హయాంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆర్థిక సంఘం నిధులను మొత్తం విద్యుత్ బకాయిల చెల్లింపునకు వాడింది. మున్సిపాలిటీకి ఇప్పటికీ విద్యుత్ బకాయిలు రూ.80కోట్ల వరకూ ఉన్నాయి. అంతంతమాత్రం ఆదాయమున్న మున్సిపాలిటీ, బిల్లులు కట్టలేక చతికిలపడుతోంది. నెలనెలా అప్పు పెరుగుతూనే ఉంది. గ్రాంట్లతోపాటు వచ్చిన పన్నుల ఆదాయం కూడా విద్యుత్ బిల్లులకే సరిపోతోంది. 15 కి.మీ. దూరంలో ఉన్న చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరికి తాగునీటిని తీసుకురావడమే దీనికి పరిష్కారం.

తాగునీటి భారం

కదిరి మున్సిపాలిటీలో లక్షకుపైగా జనాభా ఉంది. వీరికి రోజుకు 10 మిలియన్ లీటర్ల నీరు (10ఎంఎల్‌డీ) అవసరం అవుతుంది. కదిరి పరిసర ప్రాంతాల్లో తాగునీటి వనరులు లేవు. దీంతో అప్పట్లో పార్నపల్లి వద్ద ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నుంచి తాగునీటిని తీసుకొచ్చారు. దీనికోసం రూ.100 కోట్లు ఖర్చు చేశారు. సీబీఆర్ నుంచి కదిరి దాదాపు 70 కి.మీ. దూరం ఉంది. సీబీఆర్ నుంచి దొరిగిల్లు, మలకవేమల, కుటాగుళ్ల.. ఇలా నాలుగు పంపింగ్ స్టేషన్ల నుంచి కదిరి వరకు 1000 హెచ్‌పీ మోటార్ల సామర్థ్యంతో పంపింగ్ జరుగుతోంది. దీంతో విద్యుత్ బిల్లుల భారం నెలకు రూ.40లక్షల వరకు వస్తోంది. నెలనెలా ఇంత బిల్లు చెల్లించడం మున్సిపాలిటీకి తలకు మించిభారంగా మారింది. రూ.80 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి.

ఆ నీటితో 80శాతం ఆదా..

చెర్లోపల్లి డ్యామ్ నుంచి కదిరికి తాగునీటిని తీసుకొస్తే.. భారీగా ఖర్చు తగ్గుతుంది. కదిరి పట్టణానికి కేవలం 15 కి.మీ. దూరంలో చెర్లోపల్లి డ్యామ్ ఉంది. అక్కడి నుంచి తాగునీరు తీసుకొస్తే విద్యుత్ బిల్లుల భారం 80 శాతం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. 120 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న మోటార్లతోనే తాగునీరు అందించవచ్చని అంటున్నారు. ఎత్తైన ప్రాంతంలో ఉన్న చెర్లోపల్లి డ్యామ్ నుంచి కదిరికి తాగునీరు అందించడం సులువు అంటున్నారు. పైపులైన్ వేస్తే పట్టణ తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది.

సీఎం చంద్రబాబు హామీ

కదిరికి చెర్లోపల్లి డ్యామ్ నుంచి తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటామని నాటి టీడీపీ ప్రభుత్వంలోనే చంద్రబాబు హామీ ఇచ్చారు. 0.4 టీఎంసీ నీటిని కేటాయిస్తూ జీవో కూడా జారీ చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని వదిలేసింది. దీంతో పట్టణ, శివారు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు పెరిగాయి. ప్రస్తుతం వారానికి ఒక్కరోజే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా కందికుంట వెంకటప్రసాద్ దీనిపై ప్రజలకు హామీ ఇచ్చారు. నెరవేర్చే దిశగా అడుగులు పడుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం..



మున్సిపాలిటీకి విద్యుత్ చార్జీల భారం తగ్గించడానికి చెర్లోపల్లి డ్యామ్ నుంచి పట్టణానికి పైపులైన్ వేయడానికి ప్రతిపాదనలు పంపాం. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచనల మేరకు అమృత్ 2.0లో ఈ ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సుమారు రూ.21 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశాం. నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయి. మార్చిలో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఈ పైపులైన్ పూర్తయితే 80 శాతం విద్యుత్ బిల్లులు తగ్గిపోతాయి.

-విజయ్‌కుమార్, డీఈ, మున్సిపాలిటీ

బకాయిలను మాఫీ చేయాలి..



కదిరి పట్టణానికి సీబీఆర్ నుంచి కాకుండా దగ్గరలో ఉన్న చెర్లోపల్లి డ్యామ్ నుంచి నీరు అందించాలి. తద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయి. ప్రజలు చెల్లించే పన్నుల సొమ్మును అభివృద్ధి పనులకు వాడుకోవచ్చు. పాలకులు దీనిపై చొరవ చూపాలి. ఇప్పటివరకు ఉన్న విద్యుత్ బకాయిలను ప్రభుత్వం మాఫీ చేయాలి.

- జీఎల్ నరసింహులు, సీపీఎం నాయకుడు

అమృత్ నిధులతో..



సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి 0.4 టీఎంసీల నీటిని కదిరి పట్టణానికి ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దీనికోసం అమృత్-2 కింద రూ.21 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలుస్తారు. ఆ వెంటనే పనులు మొదలవుతాయి.

-మిట్టపల్లి రంగారెడ్డి, 35వ వార్డు కౌన్సిలర్

పిల్లల సంరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ టీఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పిల్లల సంరక్షణ సమాజంలోని ప్రతిఒకరి బాధ్యత అని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో జిల్లా మహిళ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలల సంరక్షణ, సంక్షేమ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి జిల్లా ఎస్పీ రత్నతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పిల్లల సంరక్షణ బాధ్యత ప్రతి ఒకరిపై ఉందన్నారు. 12 ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల సంక్షేమం, సంరక్షణ పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో పిల్లల రక్షణ కమిటీలు ఏర్పాటు చేసి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బడి వయస్సు పిల్లలు తప్పకుండా పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాల న్నారు. బాలల హక్కులు, బాల్య వివాహాలపై అన్నిస్థాయిలలో ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. అనాథలు, యాచకులు, వీధి బాలల, జాబితాను మండలాలవారీగా సమర్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ పోక్సో కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను అధికారులు గుర్తించాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు పోలీసులు, రెవెన్యూ, ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డీఈఓ క్రిష్టప్ప, డీఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగప్రసాద్, డీఎస్పీ విజయ్‌కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ హరికృష్ణ, డీసీపీఓ నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాదా, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల సత్తా

7

చూసిన కనులదే భాగ్యము..

నేడు కొండమీదరాయుడి బ్రహ్మ రథోత్సవం..

ఉదయం 11:30 గంటలకు మడుగుతేరు

6

పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దండి

కేంద్ర మంత్రికి ఎంపీ బీకే వినతి



కేంద్ర మంత్రితో ఎంపీ బీకే పార్థసారథి

పుట్టపర్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాను ప్రపంచ పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రిని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను మంగళవారం ఆయన కలిశారు. జిల్లా పర్యాటక అభివృద్ధి ప్రణాళిక ప్రతిపాదనలను ఆయనకు అందజేశారు. జిల్లాలో శిల్ప, చిత్రకళల లేపాక్షి, రాయల రెండో రాజధాని పెనుకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ పక్షుల విడిది వీరాపురం, ధర్మవరం పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, హేమవతి సిద్ధేశ్వరాలయం, గిన్నీస్‌బుక్ రికార్డులకెక్కిన తిమ్మమ్మ మర్రిమాను, కటారుపల్లి యోగి వేమన సమాధి వంటి పర్యాటక, చారిత్రాత్మక కేంద్రాలు ఉన్నాయని మంత్రికి వివరించారు. వీటి అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. పెనుకొండలో కియ ఏర్పాటుతో రాష్ట్రంలో కార్ల ఉత్పత్తికి ల్యాండ్‌మార్కుగా మారిందని అన్నారు. జిల్లాలో ప్రత్యేక పర్యాటక వలయం ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు. పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో సహకార బ్యాంకుల కంప్యూటరీకరణ గురించి ఎంపీ ప్రస్తావించారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీఆర్‌ఓ విజయసారథి

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ విజయసారథి అధికారులను ఆదేశించారు. మార్చి 17 నుంచి పది పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో డీఈఓ క్రిష్టప్పతో కలిసి అధికారులతో సమీక్షించారు. పరీక్షల నిర్వాహణ, ముందస్తు ఏర్పాట్లపై చర్చించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ పది పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 23,730మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. 449 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. పరీక్ష సమయంలో కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలుచేసి, జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని పోలీసులను ఆదేశించారు. మార్చి 17నుంచి 31వరకు ఉదయం 9.30నుంచి 12:45వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు భద్రపరచడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే పది ఓపెన్ పరీక్షలు మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5వరకు నిర్వహిస్తామ న్నారు. ఈఓపెన్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 780మంది రాయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, విద్యుత్ అధికారి రమణారెడ్డి, లేబర్ అధికారి సూర్యనారాయణ, పోస్టల్ అధికారి విజయసాయికుమార్, ఆర్టీసీ అధికారి రవిచంద్ర, డీఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో శిశువు



ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువు

పండంటి మగ బిడ్డ..! ఏ తల్లి కన్నదో..! సమస్య ఏమిటో..! ముళ్ల పొదల నడుమ పాలిథీన్ కవర్‌లో కనిపించాడు. వీధి కుక్కలు పీకుతుండగా స్థానికులు గమనించి, రక్షించారు. లేదంటే బిడ్డ ఏమైపోయేవాడో..! బత్తలపల్లి మారుతీ నగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల సమీపంలో అప్పుడే పుట్టిన శిశువును గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లారు. స్థానికులు గమనించి వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. బిడ్డ ఇష్టంలేకపోతే ఎవరో ఒకరికి దత్తత ఇవ్వొచ్చు. జన సంచారం ఉండే ప్రాంతంలోనైనా వదిలి వెళ్లొచ్చు. ఇలా అమానవీయంగా ముళ్ల పొదలలో పడేసి వెళ్లడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

-ఆంధ్రజ్యోతి, బత్తలపల్లి

నకిలీనోట్ల చలామణి కేసులో నలుగురి అరెస్టు

నకిలీ రూ.30వేలు.. ఒరిజినల్ నోట్లు రూ.20,500 స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నకిలీనోట్లు చలామణి చేసిన నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. వారి నుంచి రూ.30వేల నకిలీ కరెన్సీ నోట్లు, రూ.20,500 ఒరిజినల్ నోట్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా పోలీసు కార్యాల యంలో కేసు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు మంగళవారం వెల్లడించారు. గత నెల ఏడున కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్‌లో ఇద్దరు ముదిగుబ్బ గ్రామానికి చెందిన జెన్నేపల్లి నాగేష్ నుంచి రెండు పొట్టేళ్లను రూ.30వేలకు కొన్నారు. ఈ సందర్భంగా 500 రూపాయల నోట్లు 60 ఇచ్చి వెళ్లిపోయారు. తర్వాత అవి నకిలీవి అని తెలుసుకున్న నాగేష్ కదిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కదిరి డీఎస్పీ శివన్నారాయణ పర్యవేక్షణలో సీఐ నిరంజన్‌రెడ్డి సిబ్బందితో నిందితుల కోసం గాలించారు. వివిధ సీసీ ఫుటేజీలను పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మంగళవారం ఉదయం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్ వద్ద కర్ణాటకకు చెందిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఇస్లావత్ ఫిరోలినాయక్, దుంగావత్ రవినాయక్, ఎంపీ ఆనంద్‌నాయక్, ఆదినారాయణనాయక్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

నకిలీనోట్లు చలామణి చేసిన వ్యక్తులను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన కదిరిరూరల్ అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది విజయ్‌భాస్కర్, షహీన, దామోదర్, రవికుమార్‌నాయక్, జిల్లా స్పెషల్‌టీంని అభినందించి క్యాష్ రివార్డులతో పాటు ప్రశంసాపత్రాలను జిల్లా ఎస్పీ అందచేశారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు

ఎండిన చేలు పండేలా..!

● నేడు మడకశిర ఉపకాలువకు హంద్రీనీవా నీరు ● హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



నీటితో కళకళలాడుతున్న గొల్లపల్లి రిజర్వాయర్



రిజర్వాయర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల చర్యలతో నష్టపోయిన జిల్లా ప్రజలకు ప్రస్తుతం సాంత్వన కలగనుంది. గతంలో తాగు, సాగునీరందక ఇబ్బంది పడిన ప్రజలకు ఊరట దక్కనుంది. వైసీపీ పాలనలో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి గొల్లపల్లి రిజర్వాయర్‌కు వచ్చే నీటిని మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు తరలించకుండా చిత్తూరుకు తరలించారు. దీంతో ఆయా ప్రాంతాల కింద పంటలు సాగు చేసిన రైతులు సకాలంలో నీరు అందక తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్‌కు అందాల్సిన నీరు చిత్తూరు జిల్లాకు తరలించడంతో పెనుకొండ, హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో తాగు, సాగునీటి కరువు ఏర్పడింది. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వేసవిని దృష్టిలో ఉంచుకుని గత ఏడాది సెప్టెంబరు 5నుంచే జీడిపల్లి నుంచి నీటి విడుదల ప్రారంభించారు. హంద్రీనీవా కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్‌కు రోజుకు 200నుంచి 300క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 1.91టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.70 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు హెచ్‌ఎన్‌ఎస్ అధికారులు తెలిపారు. ఈనేపథ్యంలో మంత్రి సవిత రిజర్వాయర్‌కు బుధవారం జలహారతి ఇవ్వనున్నారు. దీంతో మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు, హెచ్‌ఎన్‌ఎస్ అధికారులు కలిసి గొల్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు. మడకశిర ఉపకాలువకు బుధవారం నుంచి హంద్రీనీవా నీరు విడుదల కానుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దయ్య, మునిమడుగు వెంకటరాముడు, పోతిరెడ్డి, త్రివేంద్ర, రామక్రిష్ణ, ప్రసాద్, ఎగువగడ్డ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి

ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ ప్రభుత్వాన్ని కోరారు. పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో ఎన్ఎంయూ శ్రీసత్యసాయి జిల్లా ద్వితీయ మహాసభ మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. అన్ని కేటగిరుల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, అలాగే పాత వైద్య విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. సంస్థలో ఉద్యోగులను అక్రమ పద్ధతిలో తొలగించిన సంఘటనపై విచారణచేసి, సస్పెన్షన్ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు ప్రవేశపెట్టాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రత సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రాష్ట్ర పరిశీలకులు వినోద్, జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, పుట్టపర్తి డిపో గౌరవాధ్యక్షుడు రామలక్ష్మణ్, జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు లింగారామమోహన్, జోనల్ వైస్ ప్రెసిడెంట్ ప్రేమకుమార్, కమిటీ సభ్యులు భారతి, జిల్లా చైర్మన్ ముత్యాలప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కడపల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దగాపడ్డ రైతు..!

- హావళిగిలో భారీగా విత్తన జొన్న సాగు
- అధిక దిగుబడులతో అన్నదాత ఆనందం
- అమాంతం ధర తగ్గించేసిన దళారులు
- నష్టానికి విక్రయించుకోలేక అవస్థలు
- ఎండిపోతున్న వేల క్వింటాళ్ల నిల్వలు



హావళిగి ఉన్నత పాఠశాల వద్ద నిల్వ ఉంచిన జొన్న దిగుబడులు

విడపనకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అప్పో సప్పో చేసి.. పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించి రైతు పండించిన పంట చెల్లని కాసుగా మారిపోయింది. అన్నదాత.. దళారుల చేతిలో ఆటబొమ్మగా మారిపోయాడు. దిగుబడి దండిగా వచ్చిందన్న ఆనందంలో ఉన్న రైతుకు దళారులు దగా చేశారు. అమాంతం ధరను తగ్గించేశారు. కొనడానికి కూడా రాకుండా మొహం చాటేస్తున్నారు. దీంతో వేల క్వింటాళ్ల విత్తన జొన్న దిగుబడిని రైతు నిల్వ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాడు. తన కష్టం ఎండకు ఎండిపోతుంటే కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. మండలంలోని హావళిగి గ్రామ రైతుల దుస్థితి ఇది. జీబీసీ, హెచ్చెల్సీ, బోరుబావుల కింద దాదాపు 5వేల ఎకరాల్లో విత్తన జొన్న సాగు చేశారు. బళ్లారి జిల్లా మోకా గ్రామానికి చెందిన దళారుల నుంచి గ్రామంలోని కొంత మంది వ్యాపారులు వివిధ రకాల విత్తనాన్ని తెచ్చి రైతులకు విక్రయించారు. రెండు కేజీల సీడ్ జొన్న ప్యాకెట్ రూ.700 ప్రకారం ఎకరాకు రెండు ప్యాకెట్లు విత్తారు. దిగుబడి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు వచ్చింది. ఖర్చులు సొంత పొలం ఉన్న వారికి ఎకరాకు రూ.40వేలు, కౌలు రైతుకు రూ.60వేలు వస్తుంది. గతేడాది విత్తన జొన్నను క్వింటా రూ.4500 నుంచి 4800 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈసారి దిగుబడి ఎక్కువగా రావడంతో దీనిని క్యాష్ చేసుకునేందుకు దళారులు సిండికేట్‌గా మారారు. నెల రోజుల ముందు ఇదే విత్తన జొన్నను క్వింటా రూ.4200తో కొనుగోలు చేసిన వ్యాపారులు ఒక్కసారిగా ధర తగ్గించేశారు. ప్రస్తుతం రూ.3వేలకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే ఎకరాకి రూ.30 వేలకు మించి రాదు. పెట్టుబడి సొంత పొలం ఉన్న రైతులకు ఎకరాకి రూ.40 వేలు వచ్చింది. ఆ లెక్కన పెట్టుబడి కూడా రాదన్న మాట. దీంతో నష్టానికి ఎలా విక్రయించాలని రైతులు వాపోతున్నారు. దిగుబడిని అలానే ఉంచుకున్నారు. ఒక్కో రైతు వద్ద 600 నుంచి 1500 బస్తాల దిగుబడి నిల్వ ఉంది. దాదాపుగా 40వేల క్వింటాళ్ల జొన్న మూలన పడింది. ఇళ్లలో నిలువ ఉంచుకునేందుకు స్థలం లేని రైతులు ఎక్కడ పడితే అక్కడ ఉంచేస్తున్నారు. 15 నుంచి 20 మంది కలిసి ఓ దగ్గర నిల్వ చేశారు. మరి కొంతమంది పొలాల్లోనే నిల్వ ఉంచి రాత్రి సమయాల్లో కాపలాగా ఉంటున్నారు. ఇంకొంతమంది గోదాముల్లో నిల్వ ఉంచుకున్నారు. ఇక్కడ పండిన విత్తన జొన్నను బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. మరో నెల రోజులు జొన్న దిగుబడి ఎండకు, గాలికి, ఇలాగే ఉంటే పురుగు పట్టి కిలో రూ.10కి కూడా కొనుగోలు చేయరని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపెనీలతో ఒప్పందం లేకపోవడమే శాపమా?

విత్తన జొన్న పండించే రైతులు.. ఆయా కంపెనీలతో ఒప్పందం లేకపోవడమే వారికి శాపంగా మారిందని తెలుస్తోంది. కంపెనీతో రైతు ఒప్పందం చేసుకుని పంట పండించి ఉంటే వారే కొనుగోలు చేస్తారు. అగ్రిమెంట్ ధర రూ.5వేలు ఉంటే, ప్రస్తుత మార్కెట్ రేటుతో సంబంధం లేకుండా కంపెనీ అంతే చెల్లించేది. రైతులు.. కంపెనీలను ఆశ్రయించకుండా సొంతంగా దళారులతో విత్తనాన్ని కొనుగోలు చేసి, పొలంలో విత్తుకున్నాడు. దీంతో ఆయా కంపెనీల ప్రతినిధులు.. రైతులు పండించిన సీడ్ కల్తీదనీ, అందుకే కొనుగోలు చేయట్లేదని ప్రచారం చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్ కావడంతో ఒక్క హావళిగి గ్రామంలోనే దాదాపుగా 40 వేల క్వింటాళ్ల విత్తన జొన్న నిల్వ ఉంది. పండించిన పంట అమ్ముడుపోక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు నరక యాతన అనుభవిస్తున్నారు.



కల్లంలో నిల్వలు

విత్తన జొన్న మంచిదే..



హావళిగిలో రైతులు పండించిన విత్తన జొన్న మంచిదే. కంపెనీలతో రైతులు అగ్రిమెంట్లు చేసుకోకపోవడంతో వారు పండించిన పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం విత్తన జొన్నను కొనుగోలు చేయదు. రాయచూరు జొన్నలు మాత్రమే సేకరిస్తుంది. రైతులు పండించిన విత్తన జొన్నను మార్కెట్లకు తీసుకెళ్లి, విక్రయించుకోవచ్చు.

- పెన్నయ్య, మండల వ్యవసాయాధికారి, విడపనకల్లు

జొన్నలు మెత్తబడిపోతున్నాయి



ఆరెకరాల్లో విత్తన జొన్నను సాగు చేశా. వంద బస్తాల దిగుబడి వచ్చింది. ఇంట్లో నిల్వ చేసేందుకు స్థలం లేక పక్కింటి రైతు వామిదొడ్డిలో ఉంచా. ఎండలకు జొన్నలు మెత్తబడిపోతున్నాయి. దళారులు క్వింటా రూ.3వేలకు అడుగుతున్నారు. ఆ ధరకు విక్రయిస్తే రూ.30వేల వరకు నష్టం వస్తుంది.

-కణేకల్లు ఓబులేసు, రైతు, హావళిగి

నష్టానికి అమ్ముకుంటే అప్పులు ఎలా కట్టాలి?



20 ఎకరాలు కౌలుకు తీసుకుని, విత్తన జొన్నను సాగు చేశా. 600 బస్తాలు దిగుబడి వచ్చింది. ఇంటి వద్ద స్థలం లేకపోవడంతో పొలంలోనే నిల్వ చేశారు. రాత్రి సమయంలో కాపలాగా వెళ్తున్నాం. విక్రయిద్దామంటే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. నష్టానికి అమ్ముకుంటే అప్పులు ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- సక్కీరప్ప, రైతు, హావళిగి



నిప్పుతో ముప్పు..!

ఎండుతున్న పచ్చికబయళ్లు
అగ్నికి ఆహుతవుతున్న తోటలు
ఆందోళనలో అన్నదాతలు



మామిళ్లపల్లి వద్ద మంటలను ఆర్పేందుకు వచ్చిన ఫైరింజన్



మామిళ్లపల్లి వద్ద మంటలకు కాలిపోయిన శ్రీగంధం మొక్కలు

కనగానపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం రాకనే ఎండలు మండిపోతున్నాయి. పచ్చని గడ్డి ఎండుబారుతోంది. ప్రమాదశాత్తు నిప్పంటుకుని పచ్చని పంటలు అగ్నికి బూడిదవుతున్నాయి. సకాలంలో ఫైర్‌ఇంజన్లు ప్రమాద స్థలానికి రాకపోవడంతో మంటలు వేగంగా వ్యాపించి చీనీ, అరటి, అనప, శ్రీగంధం చెట్లు కాలిపోయి రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల మండలంలో అగ్ని ప్రమాదాలు జరిగి పలు పంటలు, డ్రిప్పు పరికరాలు బూడిదయ్యి లక్షల్లో నష్టపోయారు. చంద్రాచర్ల గ్రామానికి చెందిన రైతు రాయపాటి శ్రీరాములుకు చెందిన జామతోట కాలిపోయి రూ.4 లక్షలు నష్టపోయాడు. మామిళ్లపల్లి భరత్‌రెడ్డికి చెంది శ్రీగంధం చెట్లు, అదే గ్రామంలోని నాగప్పకు చెందిన అనపతోట కాలిబూడిదవడంతో తీవ్రంగా నష్టపోయారు. తోటల పరిసరాలు ఎండుగడ్డి ఉండటంతో బాటసారులు, అకతాయిలు నిప్పుపెట్టడంతో ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది.

ధర్మవరం డివిజన్‌కు సంబంధించి ఫైర్‌స్టేషన్ ఒక్కటే ఉండటంతో సకాలంలో ప్రమాదస్థలికి అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేకపోతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ధర్మవరం నుంచి

డివిజన్‌కు ఒకే ఫైర్‌స్టేషన్

కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు సకాలంలో వెళ్లలేకపోతున్నాయి. అటవీశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతో కొండలు మంటలకు కాలిపోతున్నాయి. దీంతో పచ్చని చెట్లతో పాటు వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి.

మానవ తప్పిదంతోనే...

మానవ తప్పిదంతోనే అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదం వల్ల పండ్లతోటలు కాలిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇందుకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించదు. రైతులు తమ పొలాల చుట్టూ ట్రెంచులు ఏర్పాటు చేసుకోవడం, చెట్ల మధ్య ఎండు గడ్డి లేకుండా కలుపు తొలగించుకోవడం వల్ల నష్ట తీవ్రతను కొంచెమన్నా తగ్గించుకోవచ్చు.

-అమరేశ్వరి, ఉద్యానశాఖ అధికారి



దాదులూరు వద్ద అగ్నికి కమిలిపోయిన జామతోట



మామిళ్లపల్లి వద్ద చీనీతోట సమీపంలో ఎండు గడ్డి



అసంపూర్తిగా హెచ్చెల్సీ భవనాలు



అసంపూర్తిగా నిలిచి పోయిన హెచ్చెల్సీ క్వార్టర్స్

శిథిలావస్థలో కార్యాలయాలు

అతిథి గృహంలో సిబ్బంది విధులు
కూటమి ప్రభుత్వంలో అయినా పూర్తయ్యేనా..?

కణేకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి ప్రధాన సబ్‌డివిజన్‌గా ఉన్న కణేకల్లులో హెచ్చెల్సీ భవనాలన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అధికారులు పరిపాలన సాగించడానికి అనేక అగచాట్లు పడాల్సి వస్తోంది. పాత భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల అధికారులు హెచ్చెల్సీ అతిథిగృహంలోకి కార్యాలయాన్ని మార్చారు. అది కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు విధులు నిర్వహించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2009లో ఆధునికీకరణలో భాగంగా నాల్గవ ప్యాకేజీలో హెచ్చెల్సీ కార్యాలయంతో పాటు అధికారుల క్వార్టర్స్ నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేసింది. దీంతో అప్పటి కాంట్రాక్టర్లు ప్రధాన హెచ్చెల్సీ సబ్ డివిజన్ కార్యాలయాన్ని దాదాపు 80 శాతం మేర నిర్మించారు. అలాగే సిబ్బంది నివాసం ఉండేందుకు అవసరమైన క్వార్టర్స్‌లో ఒక దాన్ని నిర్మించగా మరికొన్ని పునాదిస్థాయిలో నిలిచిపోయాయి. నిధులు రాకపోవడంతో అవి అసంపూర్తిగా నిలిచిపోయాయి.



అర్ధంతరంగా ఆగిన హెచ్చెల్సీ కార్యాలయం

అధికారులకు తీవ్ర ఇబ్బందులు

హెచ్చెల్సీ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఈఈ, నలుగురు జేఈలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌తో పాటు వాచ్‌మెన్‌లు, కార్యాలయ సిబ్బందితో పాటు లస్కర్లు కూడా ఉన్నారు. భవనాలు లేకపోవడంతో గతంలో అధికారులు చిన్నపాటి గదుల్లో పాలన సాగించేవారు. దాదాపు 25 కి.మీ. మేర సబ్ డివిజన్ కలిగి ఉన్న కణేకల్లుకు అనేక రికార్డులు, భూములు, నీటి సరఫరా వివరాల రికార్డులు ఉంటాయి. వాటన్నింటిని భద్రపరిచేందుకు గదులు లేక అధికారులు కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇటీవలే హెచ్చెల్సీలోని పలు మరమ్మతుల కోసం రూ. 36 కోట్ల నిధులు మంజూరు చేసింది. అర్ధంతరంగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని అధికారులు ఆశిస్తున్నారు.

పూర్తి చేస్తే బాగుంటుంది..



హెచ్చెల్సీ సబ్‌డివిజన్ కార్యాలయం దాదాపు 80 శాతం పూర్తయింది. ఫ్లోరింగ్, ఫర్నిచర్, కిటికీలు, వాకిళ్లు, లైటింగ్ వంటి 20 శాతం పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేస్తే విధులు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుంది. హెచ్చెల్సీ సబ్‌డివిజన్‌కు భవనం లేక అతిథిగృహంలో కూర్చుని విధులు నిర్వహిస్తున్నాం.

- మద్దిలేటి, హెచ్చెల్సీ డీఈఈ, కణేకల్లు

చూసిన కనులదే భాగ్యము..

- నేడు కొండమీదరాయుడి బ్రహ్మరథోత్సవం
- ఉదయం 11:30 గంటలకు మడుగుతేరు



ముస్తాబైన రథం





కొండ మీదరాయుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ కొండమీదరాయుడు స్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. కొండమీదరాయ స్వామి వైభవాన్ని కనులారా చూసి తరించేందుకు భక్తుల పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ అధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి బ్రహోత్సవాల ఏడోరోజు మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీవారు బ్రహ్మరథంపై విహరిస్తారు. ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు మడుగు తేరు లాగుతారు. వేకువజామున స్వామి వారికి భూదేవి, శ్రీదేవి అమ్మవార్లతో కల్యాణం జరిపిస్తారు. అనంతరం స్థానిక లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం నుంచి స్వామివారిని పల్లకి సేవలో రథోత్సవం వద్దకు తీసుకొస్తారు. ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి, తేరును లాగాతారు. ఉదయం మడుగు తేరును స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు లాగుతారు. సాయంత్రం 4.30కి ఆంజనేయస్వామి ఆలయం నుంచి బ్రాహ్మణ వీధి వరకు లాగి, తిరిగి యథాస్థానానికి చేరుస్తారు.

నేడు దేవరకొండపై అఖండ జ్యోతి

శబరిమల, అరుణాచలం తరహాలో ఏటా మాఘ పౌర్ణమి రోజున దేవరకొండపై అఖండ జ్యోతిని వెలిగించనున్నారు. ఆ మేరకు అఖండ జ్యోతి స్తూపాన్ని నిర్మించారు. రథోత్సవం అనంతరం సాయంత్రం 6.45 గంటలకు దేవరకొండపై అఖండజ్యోతి వెలిగిస్తారు. ఇందుకు 200 కిలోల నెయ్యిని వినియోగించనున్నారు.



నూతనంగా నిర్మించిన అఖండ జ్యోతి స్తూపం



గజవాహనంపై విహరిస్తున్న కొండమీదరాయుడు

శ్వేత గజవాహనంపై దేవదేవుడి వైభవం

కొండమీదరాయుడి బ్రహోత్సవాల్లో భాగంగా దేవదేవుడు శ్వేత గజవాహనంపై మంగళవారం విహరించారు. ఐశ్వర్యానికి ప్రతీక అయిన ఏనుగుపై కొలువుదీరి శ్రీవారు.. భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, చిన్నరథంపై పురవీధుల్లో ఊరేగించారు. గజవాహన సేవ బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది.

బెదిరిస్తే.. సహించం

- కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం
- ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు



కార్యాలయ ఆవరణలో సంఘం నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పనుల కోసం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)ని బెదిరిస్తే సహించేది లేదని ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి అనంతపురం డీఈఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అనంతపురంలోని పాత డీఈఓ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో సమావేశమయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంకుమార్ మాట్లాడుతూ... కొంతమంది టీచర్లు, ఎంఈఓలు.. సొంత పనుల కోసం డీఈఓ ప్రసాద్ బాబుపై బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. కులసంఘాల పేరుతో తాము చెప్పిన వారికి పోస్టింగ్ ఇవ్వలేదంటూ డీఈఓను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేశ్వర్‌రెడ్డి, సహాధ్యక్షుడు పార్థసారథి, నాయకులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీకి నీరు బంద్



సరిహద్దు వద్ద హెచ్చెల్సీలో తగ్గిన నీరు

రాయదుర్గం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి జిల్లాకు అందుతున్న జలాలు మంగళవారం ఉదయం నుంచి ఆంధ్రా సరిహద్దులో తగ్గుముఖం పట్టాయి. సాయంత్రానికి సరిహద్దులో నీటిమట్టం పూర్తిగా పడిపోయింది. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి కోటా పూర్తవడంతో సరఫరాను సోమవారం రాత్రి నుంచి బోర్డు అధికారులు నిలిపివేశారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ కోటాగా 30.354 టీఎంసీల జలాలు అందాయి. జిల్లాకు తాగునీటి అవసరాల కోసం మూడు టీఎంసీలను కేసీ కెనాల్ కేటాయింపుల నుంచి హెచ్చెల్సీకి మళ్లించారు. జిల్లాకు ఈ ఏడాది మొత్తంగా 33.354 టీఎంసీల జలాలు హెచ్చెల్సీ నుంచి అందాయి. గతేడాది జూలై 24వ తేదీ నుంచి హెచ్చెల్సీకి నీరు విడుదల చేయగా.. ఫిబ్రవరి 10వ తేదీ వరకు కాలువలో నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగింది. కర్ణాటక, ఆంధ్ర నీటి వాటాను కలిపి సరిహద్దులోని 105 కి.మీ. వరకు తీసుకున్నారు. కర్ణాటక వాటా త్వరగా ముగిసిపోవడంతో డిసెంబరు, జనవరి నెలల్లో ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని కర్ణాటక అవలంబించింది. తద్వారా ఆంధ్ర వాటా నీరు మాత్రం సింగిల్ ఇండెంట్ కింద నిరంతరాయంగా తీసుకోవడంతో ఈ ఏడాది కొంత ప్రవాహ నష్టాన్ని భరించాల్సి వచ్చింది. అయినా గతంతో పోల్చితే ఈ ఏడాది జలాలు ఆశించినస్థాయి కంటే ఎక్కువగానే అందాయి. ఎగువన వర్షాలు సమృద్ధిగా కురవడంతో నీటి కొరత ఏర్పడలేదు. జలాశయం 19వ నంబరు క్రస్ట్‌గేట్ ఊడిపోయినప్పటికీ దీని ప్రభావం ఏమాత్రం హెచ్చెల్సీ వాటాపై పడలేదు. కొంతవరకు ఆందోళన కలిగించినా వర్షాలు కురిసి జలాశయం నిండడంతో కోటా నీరు పూర్తిగా అందింది. అంతరాయం ఏర్పడకుండా సరఫరా చేసుకోగలిగారు. ఖరీఫ్‌కు నీటి కొరత రాకుండా మెండుగా జలాలు అందాయి. జిల్లాలోని పీఏబీఆర్‌లో 3.650 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 1.221 టీఎంసీలు, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 8.00 టీఎంసీలు, మైలవరంలో 2.80 టీఎంసీలు, చాగల్లులో 0.802 టీఎంసీలు, పెండేకల్లులో 0.267 టీఎంసీలు, కణేకల్లు చెరువులో 0.325 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ ద్వారా అందిన జలాలను తాగునీటి అవసరాల కోసం ఆయా రిజర్వాయర్ల నిల్వ చేశారు. 195 రోజులపాటు హెచ్చెల్సీలో నీటిని జలాశయం నుంచి తీసుకుని జిల్లాలో తాగు, సాగునీటి సమస్య లేకుండా ఈ ఏడాది అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లారు. తుంగభద్ర జలాశయంలో కూడా ఈ ఏడాది ఇప్పటివరకు 45.787 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది తొమ్మిది టీఎంసీలు మాత్రమే నిల్వ ఉండేది. నీటి లెక్కల ప్రకారం తాగునీటి అవసరాల కోసం మరికొన్ని జలాలను మళ్లించుకునేందుకు జలాశయంలో లెవల్ కూడా అనుమతించే పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు.. ఆయా రాష్ట్రాలకు సంబంధించిన నీటిలో మిగులు జలాలు ఉంటే వాటిని హెచ్చెల్సీకి మళ్లించుకుని తాగునీటి అవసరాల కోసం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నాలు చేసుకున్నా లాభదాయకంగా ఉంటుంది. చివరకు ఈ ఏడాది హెచ్చెల్సీ ద్వారా అందిన జలాలు సంతృప్తిని కలిగించాయని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది.

అర్బన్‌లో 2,283 మందికి ఎన్టీఆర్ గృహాలు

గ్రామీణ ప్రాంతాల్లో నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి: హౌసింగ్ పీడీ శైలజ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ హౌసింగ్ కింద మున్సిపాలిటీల్లోని 2,283 ఇళ్లకు ప్రతిపాదనలు పంపినట్లు హౌసింగ్ పీడీ శైలజ మంగళవారం తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమె.. ఎండీ కార్యాలయానికి పంపారు. ఇందులో అనంతపురం 613, గుంతకల్లు 535, కళ్యాణదుర్గం 263, రాయదుర్గం 243, తాడిపత్రి 429, గుత్తి 200 మొత్తం 2,283 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాబితాలను ఇంజనీర్ల ద్వారా రాజధాని అమరావతికి అప్రూవల్ కోసం పంపారు. ఈ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష, లబ్ధిదారుడి వాటా రూ.2లక్షలతో మొత్తం రూ.4.5 లక్షల యూనిట్ ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు పీడీ తెలిపారు. సొంత స్థలం ఉన్న వారికి మాత్రమే అర్బన్ హౌసింగ్ మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.



ప్రతిపాదనలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శైలజ

నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి

సొంత స్థలం ఉన్నవారు నెలాఖరులోపు ఆయా గ్రామ సచివాలయాల్లో పీఎంఏవై-ఎన్టీఆర్ హౌసింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు. వారి జాబితాను ఆయా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలు సభ్యులుగా ఉండే బృందం పరిశీలించి, పీడీ కార్యాలయానికి పంపుతారన్నారు. సొంత స్థలం కల్గిన అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పీడీ సూచించారు.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6వేలు, సరాసరి రూ. 16,320 తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



క్రైం కార్నర్ ■ బతుకు ముగించారు..

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య


కళ్యాణి (ఫైల్)

ముదిగుబ్బ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేదనను భరించలేక బతుకు ముగించారు. జిల్లాలో వేర్వేరుచోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మండలంలోని ఎస్. బ్రాహ్మణపల్లికి చెందిన కళ్యాణి (35) సోమవారం రాత్రి బావిలో పడి ప్రాణం తీసుకుంది. ముదిగుబ్బ సీఐ శివ రాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్యాణికి మల్లి కార్జునతో వివాహమైంది. మల్లికార్జున గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. వారిలో ఒకరు క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. కళ్యాణి కూడా మూర్ఛ వ్యాధితో సతమతమవుతుండేది. ఈ పరి ణామాలతో తీవ్ర మనస్తాపం చెందిన కళ్యాణి చనిపోతానంటూ కుటుంబ సభ్యులతో తరచూ చెబుతుండేది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి ఊరి చివర బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భార్య కాపురానికి రాలేదని..


గంగాద్రి (ఫైల్)

తనకల్లు: భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో మండలంలోని బొంతపల్లికి చెందిన గంగాద్రి (22) సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగాద్రికి కర్ణాటకలోని శివపురం గ్రామానికి చెందిన రక్షితతో వివాహమైంది. వారికి రెండేళ్ల కుమారుడు ప్రణీత్ ఉన్నాడు. రెండేళ్లుగా రక్షిత పుట్టింట్లోనే ఉంటోంది. దీంతో గంగాద్రి తీవ్ర మనస్తాపం చెందాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని, మరణించాడు. ఉదయాన్నే గమనించిన కుటుంబీకులు బోరుమన్నారు. గంగాద్రి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని కదిరి ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో సెంట్రింగ్ కార్మికుడు..


శ్రీధర్‌నాయక్ (ఫైల్)

ధర్మవరంరూరల్: మండలంలోని ఓబుళనాయునిపల్లి ఎగువతండాలో అప్పుల బాధతో సెంట్రింగ్ కార్మికుడు శ్రీధర్‌నాయక్(25) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణస్వామినాయక్, లక్ష్మీదేవిబాయి దంపతుల కుమారుడు శ్రీధర్‌నాయక్ సెంట్రింగ్ పనులకు వెళ్తుండేవాడు. రెండేళ్ల క్రితం తల్లిదండ్రులు మృతి చెందడంతో శ్రీధర్‌నాయక్ కుంగిపోయాడు. ఉన్న ఒక సోదరుడు బెంగళూరులో నివసిస్తున్నాడు. శ్రీధర్‌నాయక్ ఒక్కడే ఊరిలో ఉండేవాడు. రోజూ సెంట్రింగ్ పనులు చేసుకుని, గ్రామానికి చేరుకునేవాడు. పనులకు వస్తానని చెప్పి పలువురి వద్ద అడ్వాన్సుల కింద రూ.2లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక ఆవేదన చెందుతుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం 8 గంటలైనా ఇంటి తలుపులు తీయకపోవడంతో స్థానికులు గమనించారు. తలుపులు పగులగొట్టి చూడగా.. ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కిలో గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీఐ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని షికారి కాలనీలో కిలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న షికారి నాగరాజును అరెస్టు చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గంజాయి పట్టివేత వివరాలను సీఐ మనోహర్ వెల్లడించారు. షికారి కాలనీకి చెందిన నాగరాజు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు వెళ్లి అక్కడ రైల్వే ప్లాట్‌ఫాంలో కిలో గంజాయి కొనగోలు చేసి, గుంతకల్లుకు తీసుకొచ్చాడు. చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి, ఒక్కొక్కటి రూ.150 చొప్పున విక్రయిస్తున్నాడు. కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. షికారి నాగరాజును అరెస్టు చేసి, అతడి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ.. నగల అపహరణ

కుందుర్పి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లికి చెందిన పుట్టమ్మ ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. పుట్టమ్మ కుటుంబ సభ్యులంతా జీవనోపాధి కోసం బెంగళూరు వెళ్లారు. ఆమె ఒక్కరే ఇంటి వద్ద ఉంటోంది. భోజనం చేసుకుని, సమీప బంధువుల ఇంటికెళ్లి రాత్రికి బస చేసి, ఉదయమే ఇంటికెళ్తుంది. సోమవారం రాత్రి కూడా ఇంటికి తాళం వేసుకుని, బంధువుల ఇంటికెళ్లింది. అర్ధరాత్రి సమయంలో దొంగలు వెనుక వైపున కిటికీ ఇనుప కడ్డీలను ధ్వంసం చేసి, లోపలికి చొరబడ్డారు. కప్‌బోర్డులోని దుస్తులను చిందరవందర చేసి, అందులోని రూ.1.50 లక్షల విలువ చేసే కమ్మలు ఇతరత్రా ఆభరణాలు అపహరించారు. దీనిపై బాధితురాలు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారిస్తున్నట్లు ఎస్ఐ నగేశ్ తెలిపారు.

చెప్పుల షాపు యజమానిపై దొంగల దాడి

● రూ.2.40 లక్షల అపహరణ

కుందుర్పి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిజవల్లి గ్రామానికి చెందిన సికిందర్ అనే చెప్పుల వ్యాపారిపై సోమవారం రాత్రి దొంగలు దాడి చేసిరూ. 2.40 లక్షలు దోచుకెళ్లినట్లు బాధితుడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలో చెప్పుల వ్యాపారంతో పాటు పేటీఎం నగదు లావాదేవీలను చేస్తుంటాడు. రోజులాగే వ్యాపారం ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. బండిమీదపల్లి-నిజవల్లి గ్రామాల మధ్య దొంగలు దాడి చేసి కళ్లల్లో కారంకొట్టి తన వద్ద ఉన్న 2.40 లక్షలు ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. అనంతరం ఈ విషయంపై గ్రామస్థులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి చేరుకునే సరికి దొంగలు పరారైపోయారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల సత్తా


ఓం కిరణ్ (కదిరి)


నారాయణ విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్, డీజీఎం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షల ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచారు. జనవరి 22 నుంచి 29 వరకూ నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెక్షన్ పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) మంగళవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సంటెయిల్ సాధించారు.

నారాయణ విద్యార్థుల సత్తా

నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో చదువుతున్న భూపతి నితిన్ అగ్నిహోత్రి 300 మార్కులకు 290 మార్కులు పొంది 99.997 పర్సంటైల్ సాధించాడు. మహమ్మద్ ఆసిఫ్ 99.48 పర్సంటైల్, భావన 99.43 పర్సంటైల్, విశాల్ 99.36 పర్సంటైల్ సాధించారు. దీంతో విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకట్రామిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భూపతి నితిన్ అగ్నిహోత్రి అత్యుత్తమ పర్సంటైల్‌తో రాయలసీమ జిల్లాల్లోనే ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. తమ విద్యార్థులు 99 పర్సంటైల్ నలుగురు విద్యార్థులకు కాగా 98 పర్సంటైల్ పైన 7 మంది విద్యార్థులకు, 97 పర్సంటైల్ పైన 12 మందికి, 94 పైన 18 మందికి వచ్చాయన్నారు.


కౌశిక్ నాయుడు (కొత్తచెరువు)

కదిరి విద్యార్థి ప్రతిభ

కదిరిఅర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కదిరి విద్యార్థి ఓం. కిరణ్ 99.9107 పర్సెంటైల్‌తో ప్రతిభ చాటారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఓబులపతి, పుష్పావతి దంపతుల కుమారుడు ఓం. కిరణ్. హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదువుతున్న ఇతను ఓబీసీ కేటగిరిలో ప్రతిభ చాటాడు.

కొత్తచెరువు విద్యార్థికి 99.75 పర్సెంటైల్

కొత్తచెరువు: మండల కేంద్రానికి చెందిన కౌశిక్‌నాయుడు జేఈఈ మెయిన్స్ ఫస్ట్ సెషన్స్‌లో 99.75 పర్సెంటైల్ సాధించాడు. విజయవాడలోని మయూరి భవన్-1 క్యాంపస్‌లో కౌశిక్ నాయుడు ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని తల్లిదండ్రులు పురుషోత్తం, గీత తెలిపారు.

సౌభాగ్యం వద్దనుకుని..!

భర్తను హత్య చేయించిన భార్య

● వివాహేతర సంబంధంతో దారుణం
● హత్య కేసును ఛేదించిన పోలీసులు
● ముగ్గురు నిందితుల అరెస్ట్


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంతోనే మహిళ తన భర్తను హత్య చేయించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతపురం నగర శివారులోని చింతతోపులో ఈనెల రెండో తేదీన జరిగిన హత్య కేసును అనంతపురం రూరల్ పోలీసులు ఛేదించారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన దేవరకొండ కాశప్ప హత్య కేసులో అతడి భార్య దేవరకొండ సౌభాగ్య, కర్ణాటక రాష్ట్రం కోలార్ సమీపంలోని బంగారుపేట్‌కు చెందిన నవాజ్‌బేగ్, కోలార్ పట్టణానికి చెందిన గౌస్‌పీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ రాంబాబుతో కలిసి సీఐ శేఖర్ అరెస్ట్ వివరాలు వెల్లడించారు.

టమోటా మండీలో గొడవతో...


దేవరకొండ కాశప్ప అలియాస్ కాశి, అతడి భార్య సౌభాగ్య కక్కలపల్లి టమోటా మండీలో కూలీలతో మేస్త్రీ పని చేయించి తిరిగి గ్రామానికి వెళ్లేవారు. కాశప్ప మూడు నెలల కిందట తన పొలం అమ్మగా వచ్చిన డబ్బు తీసుకుని చీరల వ్యాపారం చేయడానికి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉండి పోయాడు. అతడి భార్య సౌభాగ్య మాత్రం రోజూ వచ్చి పనులు చేయించి వెళ్లేది. ఈ క్రమంలో రెండు నెలల కిందట కర్ణాటక రాష్ట్రం కోలార్‌కు చెందిన నవాజ్‌బేగ్, గౌస్‌పీర్‌లు సౌభాగ్య దగ్గర పనికి చేరారు. ఈ క్రమంలో సౌభాగ్య, నవాజ్‌బేగ్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. వారిద్దరి వ్యవహారం టమోటా మండీ మొత్తం తెలిసిపోయింది. ఈ విషయం కాశప్పకు కూడా తెలియడంతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఇద్దరినీ చంపుతానని హెచ్చరించాడు. దీంతో తమ తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను తొలగించుకుంటే ప్రియుడితో హాయిగా ఉండొచ్చని సౌభాగ్య భావించింది. నవాజ్‌తో చర్చించి, గౌస్‌తో కలిసి భర్తను హత్య చేయాలని కోరింది. ఈనెల 1వతేదీ స్థానిక కియ మోటార్స్ ఎదురుగా ఉన్న చింతతోపులోకి కాశప్పను నవాజ్, గౌస్ నమ్మించి తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగించారు. ఆమత్తులో ఉండగానే ఖాళీ బీరు బాటిల్, బండరాయితో మోది హత్య చేశారు. ఎవరికీ అనుమానం కలగకుండా ఉండేందుకు సౌభాగ్య స్థానిక పోలీసులకు తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని ఈనెల మూడో తేదీ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రూరల్ డీఎస్పీ వెంకటేశులు ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు ఛేదించారు. సీఐ శేఖర్‌కు సమాచారం అందడంతో స్థానిక ఆర్డీటీ స్టేడియం సమీపంలో ఎస్ఐ రాంబాబు, సిబ్బందితో కలిసి ఈ ముగ్గురిని అరెస్ట్ చేశారు.

రేపటి నుంచి సేవాఘడ్ ఉత్సవాలు

ఏర్పాట్లు పూర్తి



గుత్తిరూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): సంత్‌సేవాలాల్ జయంత్యుత్సవాలు గురువారం నుంచి సేవాఘడ్‌లో ప్రారంభంకానున్నాయి. సంత్‌సేవాలాల్ 286 సంవత్సరాల కిందట జన్మించి ఎన్నో మహిమలను చూపి, సుగాలీ జాతి జాగృతి కోసం ఆరాటపడిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఈక్రమంలోనే దేశంలోని బంజారాల చేత పూజింపబడుతున్నారు. అలాంటి మహనీయుడి జన్మస్థానం గుత్తి మండలంలోని సేవాఘడ్. ఎన్నో పరిశోధనల అనంతరం 25 ఏళ్ల కిందట చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓ గ్రామ శిథిలాల ఆధారంగా సేవారాజ్ మహరాజ్ గ్రామం సేవాలాల్ స్వగ్రామంగా గుర్తించారు. దానికి సేవాఘడ్ అని నామకరణం చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బంజారా ట్రస్టు అధ్వర్యంలో 14, 15 తేదీలలో జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తూ వస్తోంది. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులతో సమీక్షించారు. భక్తుల కోసం చేపట్టాల్సిన సౌకర్యాలపై పలు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


సేవాలాల్ మహరాజ్ మూలవిరాట్టు


మాతా జగదాంబ

గుత్తికోట ఆధారంగా గుర్తింపు

బంజారాల ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో అన్వేషణ సాగించి గుత్తి కోట ఆధారంగా సేవాలాల్ జన్మస్థలాన్ని గుర్తించారు. 2000వ సంవత్సరం నుంచి సేవాలాల్ జయంతి వేడుకలను సేవాఘడ్‌లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిదేళ్ల కిందట రూ.1.20 కోట్లతో మాతా జగదాంబ ఆలయాన్ని నిర్మించారు. ఉత్సవాల సందర్భంగా ఈ ఆలయంలో 2016లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్ద సంఖ్యలో వస్తారు. రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ ఏడాది కూడా దేశ వ్యాప్తంగా బంజారాలు సేవాఘడ్‌కు రానున్నారు.

అనంతలో అగ్రిస్టాక్ ప్రారంభం

● రైతులకు 11 అంకెల యూనిక్ నంబర్ల కేటాయింపు
● నెలాఖరు వరకు పీఎం కిసాన్ లబ్ధిదారులకు గడువు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అగ్రి స్టాక్ (ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్) రైతుల వివరాల నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభమయింది. రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా అగ్రిస్టాక్‌లో రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు అధికారికంగా ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి రిజిస్ట్రేషన్ చేయడంపై శిక్షణనిచ్చారు. ఆర్ఎస్‌కే సిబ్బంది తమ లాగిన్ ద్వారా రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. జిల్లాలో మూడు లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. రైతులు ఆధార్, పట్టాదారుల పుస్తకం, ఆధార్‌తో లింకైన సెల్ నెంబర్‌ను రైతు సేవా కేంద్రాలకు తీసుకువెళ్లాలి. అక్కడి సిబ్బంది అగ్రిస్టాక్ వెబ్ సైట్‌లో రైతుల వివరాలతో రిజిస్ట్రేషన్ చేస్తారు. తొలుత ఆధార్ వెరిఫికేషన్ కోసం ఒక ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత మొబైల్ వెరిఫికేషన్ కోసం మరో ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత ఈ సైన్ కోసం మరో ఓటీపీ అడుగుతుంది. మూడు ఓటీపీలు పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్ విజయవంతమయినట్లు రైతు సెల్ నెంబర్‌కు మరో సంక్షిప్త సమాచారం వెళుతుంది. ఆ మెసేజ్ వచ్చిన 48 గంటల తర్వాత 11 నెంబర్లతో కూడిన యూనిక్ నెంబర్ మెసెజ్ ద్వారా వస్తుంది. ప్రజలకు ఆధార్ ఎంత ముఖ్యమో రైతులకు (ఫార్మర్ రిజిస్ట్రేషన్ నెంబర్) ఈ యూనిక్ నంబర్ అంతే ముఖ్యం. భవిష్యత్‌లో రైతులకు సంబంధించిన అన్ని పథకాలు ఈ నెంబర్ ఆధారంగానే వర్తింపజేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.



ఆన్‌లైన్‌లో అగ్రిస్టాక్ వెబ్‌సైట్

రైతులకు యూనిక్ నంబర్ తప్పని సరి: ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

ఫార్మర్ రిజిస్ట్రేషన్ యూనిక్ నంబర్.. రైతులకు తప్పనిసరి. జిల్లాలోని రైతులందరూ స్థానిక రైతు సేవాకేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి యూనిక్ నెంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్‌ను రైతులు తీసుకువెళ్లాలి. ఈనెలాఖరులోగా పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. భవిష్యత్‌లో ఈ నంబర్ ఆధారంగానే అన్ని రకాల లబ్ధిని ప్రభుత్వం అందించే యోచన చేస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలోని ఎంఐజీ లేఅవుట్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంస్థ చైర్మన్ టీసీ వరుణ్, వైస్ చైర్మన్, జేసీ శివనారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. అహుడా కార్యాలయంలో మంగళవారం అనంతపురం(కందుకూరు), కొడూరు, ధర్మవరం లేఅవుట్లపై అహుడా, పబ్లిక్‌హెల్త్ అధికారులతో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా పనులపై ఆరా తీశారు. లే అవుట్లలో రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అహుడా సెక్రటరీ గౌరీశంకర్‌రావు, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, పబ్లిక్ హెల్త్ ఇన్‌చార్జ్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్‌చౌదరి, డీఈ రేవంత్‌కుమార్‌రెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం 33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో భాగంగా ఆకుతోటపల్లి గ్రామంలో పెద్దన్న ఇంటి వెనుక ఖాళీ స్థలంలో ఉన్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీఐ సద్గురుడు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. వీటిని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని స్థానిక బిందెలవారి కాలనీలో సీఐ జమాల్ బాషా ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. కాలనీలో గోవిందుకు చెందిన నివాసం పక్కన ఉన్న షెడ్డులో నిల్వ చేసిన 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఆలమూరుకు చెందిన సత్రశాల సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నీటిని విడుదల చేయాలి: సీపీఐ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మండలంలోని మద్దిలేరు (యోగివేమన) ప్రాజెక్ట్ నుంచి చెరువులకు నీటిని విడుదల చేయాలని శ్రీసత్యసాయి జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్యయాదవ్ కోరారు. ఈమేరకు స్థానిక సప్తగిరిసర్కిల్‌లో ఉన్న మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో సీపీఐ నాయకులు ఈఈ రాముకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ.. 25ఏళ్లుగా యోగివేమన ప్రాజెక్ట్ రైతులకు ఉపయోగపడడం లేదని... వెంటనే మరమ్మతులతో పటిష్టం చేసి ఉప యోగంలోకి తేవాలన్నారు. దీనికి మైక్రో ఇరిగేషన్ ఈఈ రాము స్పందిస్తూ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాటమయ్య, మహదేవ్, కె కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల పాట అజరామరం


ఘంటసాలకు నివాళులర్పిస్తున్న డీఆర్వో మలోల, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాసరెడ్డి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఘంటసాల పాట అజరామరమని జిల్లా రెవెన్యూ శాఖాధికారి మలోల, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతిని పురస్కరించుకుని పాత పాటల ప్రేమికుల సంఘం, పద్మశ్రీ ఘంటసాల సంగీత సాంస్కృతిక సేవాట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హౌసింగ్ బోర్డు రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కులోని ఘంటసాల మండపం వద్ద నిర్వహించిన సభకు వారితోపాటు హైదరాబాద్‌కు చెందిన గాయకుడు బాలకామేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంగీత విభావరిలో కళాకారులు ఘంటసాల పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, జీవీ రామయ్య, ఓబులదాస్, విజయ రాగవన్, బృంద, మహీధర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులను విమానమెక్కిస్తా: ఎంఈఓ


మల్లారెడ్డి, ఎంఈఓ

బెళుగుప్ప, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ మల్లారెడ్డి బంపర్ ఆఫర్ ప్రకటించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో 570కు పైగా మార్కులు సాధిస్తే విమాన ప్రయాణ అవకాశం కల్పిస్తానని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తన సొంత ఖర్చులతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వరకు విమానంలో ప్రయాణించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. పరీక్షల్లో మండలాన్ని అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయమని అన్నారు.

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్‌లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ధర్మవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విజయవాడలో విశ్వం ఎడుకేట్ ఆధ్వర్యంలో స్టార్ జూనియర్ లెవల్-3 రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని నాగలూరు వద్దగల రూపారాజీ వీసీఎంఆర్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఉషశ్రీ, సిరిచందన పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉషశ్రీ ప్రతిభచాటి తృతీయ స్థానం సాధించింది. మంగళవారం ఆ విద్యార్థులను ఆ పాఠశాల చైర్మన్ హర్షవర్దన్, డైరెక్టర్ రూపారాజ క్రిష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నీట్ పీజీ ఫలితాల్లో ధర్మవరం వాసి సత్తా


సాయిదుర్గాప్రసాద్

ధర్మవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నీట్ పీజీ ఫలితాల్లో ధర్మ వరానికి చెందిన పచ్చా శంకరనాయుడు, వనజ దంప తుల కుమారుడు పచ్చా సాయి దుర్గాప్రసాద్ రాష్ట్రస్థాయిలో 1300 ర్యాంకు సాధించాడు. నంద్యాలలోని శాంతిరాం మెడికల్ కళాశాల పల్మానాలాజీ విభాగంలో పీజీ సీటును ప్రభుత్వ కోటాలో సాధిం చారని తండ్రి శంకర నాయుడు తెలిపారు. సాయిదుర్గాప్రసాద్ కుప్పంలోని పీఈఎస్ కళాశాలలో 2016-22లో ఎంబీబీఎస్ పూర్తి చేశారన్నారు.

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక


రమేష్

కదిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఫెడరేషన్ కప్ బాడీ బిల్డింగ్ పోటీలకు తాను ఎంపికైనట్లు కదిరిలో జిమ్ నిర్వాహకుడు రమేష్ మంగళవారం తెలిపా రు. ఈనెల 22, 23 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు రాయలసీమ నుంచి తాను ఎంపికైనట్లు చెప్పారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

ధర్మవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీంతో అదే సెంటర్లో పనిచేస్తున్న హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్‌లు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయ డీఏఓ ఖతిజన్ కుబ్రాకు ఆయన, నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్‌లు ఇవ్వాలని ప్రభుత్వ జీఓలు ఉన్నాయని, అయినా ధర్మవరం ప్రాంతంలో హెల్పర్లకు అవకాశం ఇవ్వకుండా ఇంటర్వ్యూలు జరిపి కొత్తవారిని నియమించేలా అధికారులు చేపడుతున్నారన్నారు. ఈనెల 13న జరిగే ఇంట ర్వ్యూలో హెల్పర్లకు అవకాశం ఉన్న ప్రతిచోట వర్కర్లుగా ప్రమో షన్‌లు ఇవ్వాలని, లేకుంటే ఆ ఇంటర్వ్యూలను అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలీ పాల్గొన్నారు.

రేపు మంత్రి రాక

ధర్మవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం ధర్మవరానికి వస్తున్నట్లు బీజేపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో సీఎన్‌బీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఏపీయూడబ్ల్యూజే సమావేశానికి హాజరవుతారన్నారు. మధ్యాహ్నం బత్తలపల్లి మండలం పత్యాపురం గ్రామంలో సీసీరోడ్డును ప్రారంభిస్తారన్నారు.

చిన్నారులకు చేయూత

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని గాజులవారిపల్లి సమీపంలోని మాతృశ్రీ వృద్ధాశ్ర మంలో ఇటీవల ఇద్దరు చిన్నారులను చేరదీసిన విషయం తెల్సిందే. అనంతపురానికి చెందిన అమ్మ ఫౌండేషన్ అధినేత తరిమిల రమణారెడ్డి స్పందించి ఆ బాలికలకు రూ. 30 వేల విలువ చేస్తే దుస్తులు, స్కూల్ బ్యాగులు, ఆశ్రమానికి కావలసిన నిత్యావసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహ కురాలు అరుణ జ్యోతి, రమేష్‌నాయక్ యువసైన్యం సభ్యులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి

ధర్మవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఈ మేరకు ఆర్డీఓ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ భూములు అక్రమంగా అనర్హులు ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకుని పట్టాలు పొందారన్నారు. విచారించి ఆ భూములను స్వాధీనం చేసుకొని.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించి భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ అధికారి సువర్ణ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు డిసెంబరు 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● కదిరిఅర్బన్ : ఎలాంటి అభ్యంతరాలూ లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ వీవీఎస్ శర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు, సచివాలయాల మీసేవకేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఆయా సచివాలయ కేంద్రాలను సంప్రదించాలన్నారు.

ఎన్ఎంయూ రీజినల్ చైర్మన్‌గా ముత్యాలప్ప

ధర్మవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజినల్ చైర్మన్‌గా ధర్మవరం ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ముత్యాలప్ప మూడో సారి ఎంపికయ్యారు. మంగళవారం పుట్టపర్తిలో ఎన్ఎంయూ రీజనల్ సమావేశం నిర్వహించి కమిటీని ఎంపిక చేశారు. ముత్యాలప్పను ఘనంగా సన్మానించారు.


ముత్యాలప్పను సన్మానిస్తున్న నాయకులు

శ్రీవారికి చక్రస్నానం

ధర్మవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామికి అర్చకులు చక్రస్నానం చేశారు. అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ పూజా కార్యక్ర మాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి చక్రస్నానం చేయించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో పట్టణ పురవీధులలో ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం అశ్వవాహనంపై ఊరేగించారు. బుధవారంతో ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్వామివారికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు



ఘనంగా శ్రీగిరి ప్రదక్షిణ

పుట్టపర్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి గిరి ప్రదక్షిణను మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6-30 గంటలకు ప్రశాంతి నిలయం గణేశ్‌గేటు వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తిపాటలు పాడుతూ రథాన్ని లాగుతూ గిరిప్రదక్షణ నిర్వహించారు.

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



బియ్యం కోసం ఆందోళన

తనకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తమకు గత, ఈ నెల రేషన్ బియ్యం కొంతమందికే పంపిణీ చేశారని, కార్డుదారులందరికీ అవి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని వడ్డుమరవపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వారు తహసీల్దార్ కార్యాల యం వద్ద ఆందోళన చేపట్టారు. మంగళవారం చౌక బియ్యం వాహనం ద్వారా కేవలం మూడు బస్తాల బియ్యాన్ని మాత్రమే తీసుకొచ్చారని, గత నెలల కూడా ఇలాగే అరకొరగా ఇచ్చి వెళ్లిపోయారని వాపోయారు. దీనిపై ఆ వాహనం దారుడిని ప్రశ్నిస్తే.. దురుసుగా ప్రవర్తిస్తున్నాడని వాపోయారు. దీంతో తాము పనులు మానేసి.. 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న తనకల్లుకు వచ్చి.. ఆందోళన చేపడుతున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున మాట్లాడుతూ 24 గంటలలోపు గ్రామంలోని కార్డుదారులు అందరికీ బియ్యం అందించాలని చౌక బియ్యం వాహనదారుడికి ఆదేశించినట్లు చెప్పారు.


నిరసన తెలుపుతున్న వడ్డుమరపల్లి గ్రామస్థులు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ధర్మవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, ఏ స్కానింగ్ సెంటర్‌లోనైనా ఆ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మహేశ్ హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన పీసీ పీఎన్‌డీటీ చట్ట అడ్వైజరి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌ను రెగ్యులర్‌గా అన్ని డిపార్ట్‌మెంట్ల అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మాన్, డిప్యూటి డెమో శ్రీబాబాఫకృద్దీన్, పీడియాట్రిషన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గైనకాలజిస్టు వైష్ణవి, డాక్టర్ సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

గర్భవతులకు వైద్యపరీక్షలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భవతులకు వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురసిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చికిత్సలు చేశారు. కదిరి రోటరీ క్లబ్ ప్రతినిధులు నాగేంద్రరజిత్, సాగర్, గర్భవతులకు భోజన వసతి కల్పించారు.

చెరువును నింపండి

బత్తలపల్లి ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి చెరువు నింపి.. తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు ఇరిగేషన్ ఎస్‌ఈ రాజ శేఖర్‌బాబును విజ్ఞప్తి చేశారు. బత్తలపల్లి చెరువును ఎస్‌ఈ తన సిబ్బందితో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతో స్థానికులు మాట్లాడుతూ.. బత్తలపల్లిలో 20వేలకు పైగా జనాభా ఉన్నారని, దాదాపు 500 పడకల ఆర్డీటీ ఆసుపత్రి ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని.. చెరువును పూర్తిగా నింపి తాగునీటి కష్టాలు రాకుండా చూడాలన్నారు. మూడు రోజులుగా చెరువుకు నీరు వదిలినా.. కనీసం గుంతలు కూడా నిండలేదని తెలిపారు. కార్యక్రమంలో నెట్టెం రమణ, రామానాయుడు, వెంకటేష్, మనోజ్ ఉన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

నంబులపూలకుంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల అమలుకు రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలైందని, హామీల అమలు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారని అన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోండి

తాడిమర్రి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గుర్తింపు కార్డు కోసం ప్రతి రైతూ రైతుసేవా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గుర్తింపు కార్డు ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు అర్హులన్నారు.

నేడు చేనేతల సర్వసభ్య సమావేశం

ధర్మవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శమీనారా యణ స్వామి ఆలయంలో బుధవారం చేనేతల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చేనేతపట్టు చీరల తయారీ సంఘం అధ్యక్షుడు గిర్రాజురవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారని, కావున పట్టణంలోని చేనేత నాయకులు, కార్మికులు ఈ సమావేశంలో పాల్గొనాలని అన్నారు.

గడ్డికి నిప్పు పెట్టకండి

నల్లమాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పంటపొలాల్లో ఉన్న గడ్డికి రైతులు నిప్పు పెట్టకూడదని సీఐ నరేంద్రరెడ్డి సూచించారు. మంగళవారం నల్లమాడ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ.. గడ్డికి నిప్పు పెడితే.. పక్క పొలాల్లోని పంటలు కాలిపోయే ప్రమాదముందన్నారు. ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి : డీఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని, ఉల్లంగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సాయిఆరామంలో రోడ్డుభద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు నిబంధనలు తప్పకపాటించాలన్నారు. అంతకు మునుపు సాయిఆరామం నుంచి గణేష్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, కొత్తచెరువు సీఐ ఇందిర, పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ లింగన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

అగ్ని ప్రమాదంలో రూ. 80 వేలు నష్టం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొత్తచెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపం ధర్మవరం ప్రధాన రహదారి ప్రక్కన గోరంట్లకు చెందిన శ్రీనివాసులు కట్టెల వ్యాపారం చేస్తున్నాడు. శ్రీనివాసులు మంగళవారం మధ్యాహ్నం కట్టెల మండి సమీపంలో చెత్తకు నిప్పు పెట్టాడు. నిప్పురవ్వలు కాస్త గాలికి కట్టెల కుప్పలపై పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుప్రక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే వచ్చి.. ఆ మంటలు ఆర్పివేశారు. అప్పటికే దాదాపు 80 వేలు విలువైన కట్టెలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

దీన్ దయాళ్‌కు ఘన నివాళి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకుడు పండింట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సున్నంపల్లి రంగారెడ్డి, క్రిష్టప్ప, అశ్వర్థప్ప, వేమారెడ్డిపల్లి సురేష్ పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని చిలుకూరి బాలాజీ ఆలయంలో ప్రధానార్చకుడు రంగరాజన్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద పలు ధార్మిక సంఘాలు, ఆలయ అర్చకులు నిరస వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నరసింహాచారులు, కుమార్‌రాజాస్వామి, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై సమావేశం


రైతులతో మాట్లాడుతున్న పోలో ఇండియా ప్రతినిధులు

తనకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు రైతులు చేస్తున్న సేంద్రియ సాగుపై పోలో ఇండియా ప్రతినిధులు ఆరా తీశారు. మంగళవారం మండలంలోని తవళం ఆంజనేయస్వామి ఆలయం వద్ద మండలంలోని రత్నగిరి రైతు సంఘం, గంగసానిపల్లి, పెద్దపల్లి, గొళ్లపల్లి, నల్లకొండవంక, గంగమ్మ వంక, ఈదులవంక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇందులో పోలో ఇండియాతో పాటు వాసన్, జనజాగృతి ప్రతినిధులు శ్వేత, హరిజిత్‌మిశ్రా పాల్గొన్నారు. మండలంలో ప్రస్తుతం రైతు సంఘాలు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పురుగుమందులు, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం.. సేంద్రియ సాగు.. సంఘాల ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను రైతు సంఘాల నాయకులు వారికి వివరించారు. పోలో ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ సంస్థ మండలంలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని.. సేంద్రియసాగు చేసేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జనజాగృతి అధ్యక్షుడు బలరాం, ఈడీ రాంప్రసాద్, వాసన్ ప్రతినిధి ఉత్తప్ప, రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

26న సాంస్కృతిక కార్యక్రమాలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి శివాలయంలో ఈనెల 26న శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను తహసీల్దార్ అనంతాచారి, అయ్యప్ప ఆలయ సంకల్పకుడు పచ్చర్ల ఆంజనేయులనాయుడు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఉదయం 5నుంచి సాయంత్రం 5వరకు శివలింగ స్పర్శ దర్శనం, జలాభిషేకం, పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. శివాల యంలో రాత్రి జాగరణ ఉంటుందని, జానపద, కూచిపూడీ నృత్యం, కోలాటం, చెక్కభజన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో వీఆర్‌ఓ బాలప్ప, టీడీపీ నాయకులు నిజాం పాల్గొన్నారు.

ప్రభుత్వ గిడ్డంగి తనిఖీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డివారిపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ బియ్యం గిడ్డంగిని ఆర్డీఓ సువర్ణ మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న బియ్యం, చక్కెర, ఐసీడీఎస్ కందిబేడలను పరిశీలించారు. అనంతరం వాటిని స్కేల్‌పై తూకం వేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనంతాచారి, స్టాకిస్టు మనోహర్ గోడౌన్‌లో గతంలో సీజ్ చేసిన 30 క్వింటాళ్ల బియ్యం అలాగే ఉన్నాయని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి.. రోటేడ్ చేయాలని ఆర్డీఓ వారికి సూచించారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఫ్రీహోల్డు, గ్రీవెన్స్‌సెల్ గురించి ఆరా తీయడంతోపాటు, రీసర్వే జరుగుతున్న చోట్ల ప్రతిరోజు తనిఖీ చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, ఉన్నారు.

క్రైం న్యూస్ ..

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజేంద్ర నగర్‌కు చెందిన దినేష్ (28) కర్నూల్ ఆసుపత్రితో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. ఇతనిపై వారం క్రితం మండలంలోని రేగాటిపల్లి సమీపంలో ఎర్రగుంటకు చెందిన విజయ్ దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దినేష్ తలకు తీవ్రరక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చీనీకాయల లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

తాడిమర్రి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాడితోట వద్ద ఓ లారీ అదుపు తప్పి మంగళవారం బోల్తా పడింది. నార్పల మండలం ముచ్చుకుంటపల్లి రైతు చిన్నపరెడ్డి తన పొలంలోని 11 టన్నుల చీనీకాయలను లారీ (ఏపీ03 పీకే 0863) లో చెన్నైకు తరలించబోయాడు. దాడితోట వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సగానికి పైగా చీనీకాయలు దెబ్బతినడంతో తాను దాదాపు రూ.3 లక్షలు నష్టపోయానని చిన్నపరెడ్డి వాపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తిపై కొడవలితో దాడి

నల్లచెరువు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉబ్బిచెర్ల గ్రామంలో లక్ష్మీపతిపై నరసింహులు కొడవలితో మంగళవారం దాడి చేశాడు. దీంతో లక్ష్మీపతి తలకు తీవ్ర గాయమైంది. గ్రామ పరిధిలో గొర్రెలు, బర్రెలు మేపుకునే విషయంతో వీరు వాదోపవాదాలు చేసుకుని దాడులకు పాల్పడ్డారు. నరసింహులు కొడవలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీపతిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ మగ్బుల్‌బాషా తెలిపారు.

పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు

ధర్మవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జీవానంద పాఠశాల యాజమాన్యంపై విద్యార్థి నందా తండ్రి రామక్రిష్ణ టూటౌన్ పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విద్యార్థులు ఒకరినొకరు తోపులాట చేసుకోవడంతో నందా మోకాలికి గాయమైంది. ఆ విద్యార్థి ఇంటికి వెళ్లగా.. గాయాన్ని గమ నించిన అతని తండ్రి పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తన కుమారుడు గాయపడ్డాడని టూటౌన్ పోలీసుకు ఫిర్యాదు చేశారు.


కేసు నమోదు

ధర్మవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బోయవీధికి చెందిన హిమబిందు తన భర్త వంశీ క్రిష్ణ, అతని తమ్ముడు కేశవాచారీపై మంగళవారం ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. వంశీక్రిష్ణ చెడు అలవాట్లకు బానిసై అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా కేశవాచారీతో కలిసి వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మోసం చేశారని ..

ధర్మవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తనకు ఇవ్వాల్సిన రూ. 1.80 కోట్లు ఇవ్వకుండా మోసం చేశారని పట్టణానికి చెందిన బొమ్మినేని రవీంద్రనాయుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇతను ఆర్టీసీ బస్టాండ్ వద్ద గరుడా ఇన్ఫ్రా కంపెనీతో పాటు ఎర్త్ మువెర్స్ అండ్ ట్రావెలింగ్ బిజినెస్ చేస్తున్నాడు. పూణెకు చెందిన పాస్ట్ ఎయిర్ కోరియర్ సర్వీసు వారు రెండు కోబెల్కో ఎక్స్‌కవేటర్లు ఎస్‌కే 380 మోడల్ ఒక్కొక్కటి రూ.1.05కోటి మొత్తం రూ.2.10 కోట్లకు అగ్రిమెంట్ చేసుకున్నారు. రూ.30 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించి వాటిని తీసుకొని వెళ్లారు. పలుమార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో రవీంద్రనాయుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పూణెకు చెందిన ఎయిర్ కొరియర్ సర్వీసు సెంటరు వారిపై కేసు నమోదు చేశారు.

సచివాలయ ఉద్యోగికి బెదిరింపులు


వేలు చూపిస్తూ బెదిరిస్తున్న జయరాం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వైసీపీ వీడి బీజేపీలో చేరిన ఓ నాయకుడు సచివాలయ ఉద్యో గిపై బెదిరింపులకు దిగాడు. మండలంలోని పోతుకుంట గ్రామానికి చెందిన జయరాం ఇటీవల వైసీపీ వీడి.. బీజేపీలో చేరాడు. తాను చెప్పిన వాళ్లకు పనులు చేసిపెట్టలేదని ఆయన పోతుకుంట సచివాల యంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జనార్ధన్‌నాయుడుపై బెదిరింపులకు దిగాడు. మద్యంమత్తులో నానాదుర్భాషలాడాడు. అంతుచూస్తానని వేలు చూపుతూ బెది రించాడు. దీంతో డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. దీనిపై ఎస్ఐ శ్రీనివాసులును అడగ్గా స్టేషన్‌కు సచివాలయ ఉద్యోగులు వచ్చారని, అయితే జరిగిన విషయంపై ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

మానవత్వానికి గొప్ప ఉదాహరణ: ఎంపీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా తలుపుల మండలం నంగివాండ్లపల్లికి చెందిన నంగి భూమిక అకాల మృతి చెందడం చాలా బాధాకరమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ కామినేని ఆస్పత్రిలో హౌస్ సర్జన్‌గా పనిచేస్తున్న భూమిక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయితే, ఆమె తండ్రి నందకుమార్‌రెడ్డి, ఎంతో గొప్ప మనో ధైర్యంతో తన కుమార్తె కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు దానం చేసి ఐదుగురికి కొత్త జీవితాన్ని ఇచ్చారన్నారు. ఈ మహోన్నత నిర్ణయం మన అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు.

న్యూస్ బాక్స్

నీటి కుంటలా రహదారి



పైడేటి రహదారిపై నిలువ ఉన్న చెరువు నీరు

పరిగి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):పరిగి-పైడేటి రహదారిపై నిత్యం నీరు నిలువ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిగి గ్రామ సమీపంలో చెరువు నుంచి రోడ్డుకు రెండవవైపున ఉన్న పొలాలకు వెళ్లాల్సిన నీరు రోడ్డుపై నుంచి వెళ్లడంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. గతంలో ఈ రోడ్డులో నిర్మించిన కల్వర్టు పూడిపోవడంతో ఆ నీరంతా రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. నిత్యం రోడ్డుపై నీరు నిలువ ఉండటంతో రోడ్డు గుంతలమయంగా మారింది. నీటి మడుగు కారణంగా రాత్రి సమయంలో ఈ రోడ్డుపై నుంచి వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించి రోడ్డుపై నీరు నిలువ కుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మామిడి చెట్లు దగ్ధం

పరిగి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నంపల్లి గ్రామ పొలాల్లో మంగళవారం రైతు సుగాలి అనసూయమ్మకు చెందిన 200 మామిడిచెట్లు దగ్ధమయ్యాయి. కొంతకాలంగా ఆంధ్ర, కర్నాటక సరిహద్దుల్లో మందుల షాపులు తెరుచుకోవడంతో మందుబాబుల రద్దీ ఎక్కువ అయిందని, మామిడిచెట్లవద్దే మద్యపానం చేస్తూ ఆ చెట్లకు నిప్పంటిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అదేవిధంగా మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మామిడి చెట్లు కాలిపోయాయని తెలిపింది. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని కొంతమేర చెట్లను కాపాడారని, ఈ మేరకు పరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. ప్రభుత్వం స్పందించి తనకు పరిహారం ఇవ్వాలని ఆమె కోరుతోంది.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):రోడ్డు భద్రతామాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీసీ డిపోలో మెడికల్ ఆఫీసర్ అపర్ణ ఆధ్వర్యంలో 27 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జ్ డిఎం ఇనాయతుల్లా గ్యారేజ్ ఎంఎఫ్ నిశాంత్‌ట్రాఫిక్ ఇన్‌చార్జి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గర్భిణులకు అన్నదానం చేపట్టారు. గత ఆరేళ్లుగా ట్రస్ట్ ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు మంత్రి సవిత కృషిచేస్తున్నట్లు కన్వీనర్ సిద్దలింగప్ప తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, ఎంఎల్‌టి అనీల్, నాయకులు వడ్డె సూరీ, శివశంకర్‌యాదవ్, కిష్టప్ప పాల్గొన్నారు.

సమైక్యతా దినోత్సవానికి పురం విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):జాతీయ సమైక్యతా శిబిరానికి హిందూపురం బాలయేసు కళాశాల బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సూరి పద్మ ఎంపికైనట్లు ఎస్కె యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ఆచార్య మురళీధర్ తెలిపారు. ఈ నెల 16 నుంచి 22 వరకు మహారాష్ట్ర కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ సమైక్యతా శిబిరంలో ఏపి తరుపున ఆమె పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని కళాశాల అధ్యక్షుడు బలరామిరెడ్డి, ప్రిన్సిపాల్ జియావుల్లా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అశ్వర్థనారాయణ, హరీష్ శివరామిరెడ్డి తదితరులు అభినందించారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఓ ప్రకటన ద్వారా మంగళవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతోమంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మీసేవా కేంద్రాలు దరఖాస్తు చేసుకునే విధానాన్ని రెవెన్యూశాఖ తీసుకొచ్చారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి రైతు రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

పెనుకొండరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : ఇస్లాపురం సొసైటీలో రుణం పొందిన ప్రతి రైతు సకాలంలో రుణాలు చెల్లించి వాటిని రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ సీఈఓ హరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇస్లాపురం సొసైటీలో తీసుకున్న ఎల్‌టీ, క్రాప్‌లోన్లను రైతులు మార్చి 15లోపు బ్యాంకుకు చెల్లించి రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ రుణాలకు సకాలంలో వడ్డీ చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపడతాం..

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఐ కార్యాలయం సమీపంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పాత పోస్టాఫీసు ప్రాంతంలో పర్యటించారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో రమణమ్మ, నంజుండ, సోము, బాబాఫకృద్దీన్, సోము తదితరులు పాల్గొన్నారు.

దైవసేవకు ఎదురుచూపులు

- చైర్మన్ పదవుల కోసం తీవ్ర పోటీ
- ఆలయ కమిటీల భర్తీకి కసరత్తు
- సేవచేసేవారికి ప్రాధాన్యం దక్కేనా?

హిందూపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానికంగా నామినేటెడ్ పదవులు ప్రకటిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా ఆలయాల కమిటీలు ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రసిద్ధిచెందిన దుర్గా, పాపనాశేశ్వరస్వామి ఆలయం, హిందూపురంలో వెలసిన పేట వెంకటరమణస్వామి ఆలయం, అనంత పద్మనాభస్వామి, గుడ్డం రంగనాథస్వామి, సూగూరు ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల కమిటీల ఎంపిక త్వరలో జరుగనున్నట్లు తెలిసింది. ఇందుకోసం కూటమి పార్టీలోని నాయకులు చైర్మన్ స్థానాలు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో రెండు మూడు ఆలయాలకు తీవ్రస్థాయిలో నాయకులతో కలిసి ఎమ్మెల్యేపై ఒత్తిడి తెప్పిస్తున్నట్లు తెలిసింది.



లేపాక్షి ఆలయ ముఖద్వారం

వైసీపీ హయాంలో అడిగేవారే లేరు

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో పేట వెంకటరమణస్వామి ఆలయానికి మాత్రమే కమిటీ ఏర్పాటు చేశారు. అదికూడా 2023ఆఖరిలో ప్రకటించారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆలయాల అభివృద్ధికి, ధూపదీప నైవేద్యాల గురించి కూడా ప్రభుత్వం ఆలోచించలేదు. దీంతోపాటు అప్పట్లో నామినేటెడ్ పదవులు పొందిన కొంతమందికి విలువలేకుండా చేయడంతో వైసీపీ కాలంలో ఆలయ కమిటీలకోసం ఎవరూ పోటీపడిన దాఖలాలులేవు. దీనివల్ల కొన్ని ఆలయాలకు కమిటీలే లేకుండా గడిపేశారు.

కూటమి వచ్చాక తీవ్ర పోటీ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చిన్నపదవికి కూడా తీవ్ర పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలల తరువాత స్థానికంగా ఉన్న నామినేటెడ్ పదవులు భర్తీచేస్తారని చెప్పడంతో ఆ శావహులు అధికమయ్యారు. ఆలయాల చైర్మన్ స్థానాలు దక్కించుకునేందుకు తీవ్ర పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఎందుకంటే ఈ ప్రభుత్వంలో చిన్న పదవికి కూడా గౌరవం ఉంటుందని భావించి వాటి కోసం పోటీ పడుతున్నారు. ముఖ్యంగా ఆలయ చైర్మన్లకు మరీ గౌరవం ఉంటుందని దీంతో ఒక్కోచైర్మన్ సీటుకోసం నలుగురైదుగురు పోటీ పడుతున్నారు. ఈ తరుణంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీ ముఖ్య నాయకులద్వారా తమ పేరుప్రతిపాదించాలని కోరుతున్నట్లు సమాచారం.

సేవచేసేవారికే తొలి ప్రాధాన్యం

ఇదిలా ఉంటే హిందూపురం నియోజకవర్గంలో హిందూపురం, లేపాక్షి ఆలయాల కమిటీలలో ఒక్కోదానికి ఎనిమిది నుంచి పది మంది సభ్యులుంటారు. అయితే చైర్మన్లతోపాటు కమిటీల్లో ఉండే సభ్యులు కూడా సేవ చేసేవారై ఉండాలని అలాంటివారకే ఆలయ కమిటీలో చోటు కల్పించాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ యోచిస్తున్నారు. ఆలయాల అభివృద్ధి కోరేవారికే ఆలయ కమిటీలో చోటు దక్కుతుందని కూటమి నాయకులు పేర్కొంటున్నారు. ఎందుకంటే బాలకృష్ణకు దేవునిపట్ల భక్తి ఎక్కువ. అందుచేతనే హిందూపురం నియోజకవర్గంలో ఆలయాల కమిటీల్లో మంచివారికే చోటు కల్పించాలని, అలాంటివారిని ఎంపిక చేయాలంటూ సూచన ప్రాయంగా ఆదేశించినట్లు సమాచారం.

ప్రతి చెరువుకు నీరివ్వడమే లక్ష్యం

- ఆయకట్టు సంఘం అధ్యక్షులతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో ప్రతి చెరువును నీటితో నింపాలని లక్ష్యంగా పెట్టుకొన్నామని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో మంగళవారం మైనర్ ఇరిగేషన్ అధికారులు ఆయకట్టు సంఘం అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్ శాఖ నుండి రైతులకు, ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసేందుకు అవసరమైన



చెరువుల స్కెచ్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో జిల్లాలోనే అత్యధిక చెరువులు ఉన్నాయని, చెరువుకు గండి పడటం, తూముల మరమ్మతులు తదితర వాటిపై పలు సూచనలు చేశారు. చెరువులో కంపచెట్లు తొలగించడం, శిథిలావస్థలో ఉన్న చెక్‌డ్యాంలు మరమ్మతులు తదితర విషయాలపై చర్చించారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తా

నియోజకవర్గంలోని ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగా ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలో చీపులేటి వద్ద ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమను గుండుమల తిప్పేస్వామితో కలిసి పరిశీలించారు. ఈనెల 15వతేదీన మెగాజాబ్‌మేళా కార్యక్రమాన్ని మధుగిరి రోడ్డు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 50కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని, ఇందులో డిగ్రీ వరకు చదివిన వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి సైతం స్థానికంగానే ఉపాధి కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల సమ్మె

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు సోము పేర్కొన్నాడు. హిందూపురం, పెనుకొండ రెండు డివిజన్లలో 53 మంది ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. రాత్రి పగలు కష్టపడి, ఎండనక, వాననక ప్రజలు బాగుండాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రజలకు తాగు నీటిని అందించి సహకరిస్తున్నామన్నారు. చాలీ చాలని జీతాలు ఇస్తున్నా సర్దుకుపోతున్నామన్నారు. అయితే ఇచ్చే కొద్ది జీతం కూడా 10 నెలలుగా ఇవ్వకుండా మానసికంగా క్షోభకు గు రిచేసేలా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన చెందారు. జీతాలు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎస్ఈ, లేబర్ డిప్యూటీ కమిషనర్, కలెక్టర్‌లకు రాత పూర్వకంగా వినతులు కూడా అందించామన్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో విసుగు చెంది మంగళవారం పరిగి మండలం గొల్లపల్లి పంప్‌హౌస్ వద్ద రెండు డివిజన్ల కార్మికులు హాజరై సమావేశం ఏర్పాటు చేసి చర్చించామన్నారు. ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే అప్పులు చేసి బతుకుతున్నామని, ఇక ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము, కార్యదర్శి మురళి, కమిటీ సభ్యులు నాగేంద్ర, గిరి, జబిఉల్లా, శివకుమార్, రవికుమార్, నరసింహమూర్తి, సోమయ్య, చిన్నపరెడ్డి, మంజు పాల్గొన్నారు.

రైతులకు వరం.. ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య

చిలమత్తూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతుకి ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖ కేటాయిస్తోందని మండల వ్యవసాయ శాఖ అధికారి వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ సేవలను మరింత సులభతరం చేసేందుకు వీలుపడుతుందన్నారు. ఆయన మంగళవారం రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ప్రతి రైతు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంటల బీమా, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందవచ్చన్నారు. గ్రామంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈ ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు అవసరమయ్యే ఆధార్ నంబర్, ఆధార్‌తో అనుసంధానం చేసిన మొబైల్ నంబర్, పట్టాదార్ పాసుపుస్తకం తీసుకుని వెళ్లాలన్నారు.

ఫార్మర్ ఐడీ నమోదులో రైతులు



సోమందేపల్లి ఆర్బీకేలో ఫార్మర్ ఐడీ నమోదు చేసుకుంటున్న రైతులు

సోమందేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఫార్మర్ ఐడీ నమోదు చేసుకునేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. మంగళవారం మండలంలోని 13ఆర్బీకేల్లో 205మంది ఫార్మర్ ఐడీలు నమోదు చేసుకున్నట్లు ఏఓ కవితరాణి తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ పథకాల ద్వారా లబ్ధి పొందడంతోపాటు వ్యవసాయసేవలను అందుకునేందుకు రైతులకు ప్రభుత్వం గుర్తింపు సంఖ్యను కేటాయిస్తోందన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్

హిందూపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులను మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్ అభినందించారు. పది మంది కరాటే విద్యార్థులు ఇన్‌స్ట్రక్టర్ ఫైరోజ్ ఆధ్వర్యంలో విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మునిసిపల్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో హిందూపురానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరచారు. వారిని మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్, కమిషనర్ సంఘం శ్రీనివాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అయూబ్, గిరి, సతీష్, రహమత్‌బీ, నాగేంద్రమ్మ, కోరుముట్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శనైశ్చర ఆలయంలో ఉత్సవాలు



కల్యాణోత్సవానికి సిద్ధమైన జేష్టదేవి సమేతుడైన శనైశ్వరుడు

పావగడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పావగడ శనైశ్చరస్వామి ఆలయంలో మాఘమాస ఉత్సవాలను ఈనెల 12 నుంచి 21వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆనందరావు, మాజీ అధ్యక్షులు కేవీ శ్రీనివాస్ తెలిపారు. జేష్టదేవి సమేతుడైన స్వామి కళ్యాణోత్సవానికి మంగళవారం సాయంత్రం నుంచి ముస్తాబై భక్తులకు ఎంతగానో ఆకర్షించారు. ప్రతిరోజూ ఉదయం గణపతి పూజ, నవగ్రహ, కళశ స్థాపన, అంకురార్పణ, సూర్యారాదన, మహామంగళహారతి, సాయంత్రం దేవతారాధన వేదపారాయణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు.

పేద పిల్లల విద్యాభివృద్ధే ఆర్డీటీ ధ్యేయం

అగళి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధే ధ్యేయంగా ఆర్డీటి స్వచ్చంద సంస్థ పనిచేస్తుందని ఏటీఎల్ ఓబులేస్ పేర్కొన్నారు. అగళి మండలం ఇనగలూరు గ్రామంలోని ఆర్డీటి భవనంలో ఉన్నత చదువులు చదువుతున్న 12కుటుంబాల విద్యార్థుల తల్లిదండ్రులకు 93వేల రూపాయిల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎటిఎల్ మాట్లాడుతూ అమ్మాయిలు, అబ్బాయిలను ఇద్దరిని సమానంగా ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు వెళ్లి గుండెపోటుతో మృతి

గుడిబండ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన నాగరాజు యూపీలో జరుగుతున్న కుంభమేళా కార్యక్రమానికి వెళ్లి గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపారు. కుంభమేళాకు వెళ్లిన నాగరాజు ఒక్కసారిగా మంగళవారం ఉదయం గుండెపోటు వచ్చి మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.



నాగరాజు (ఫైల్)

నేడు మాఘపూర్ణిమ.. ఊరూరా రథోత్సవాలు

మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని హిందూపురం, మడకశిర డివిజన్లలోని పలు దేవాలయాల్లో బుధవారం రథోత్సవాలు జరగనున్నాయి.

నేడు కొల్లాపురమ్మ రథోత్సవం

సోమందేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగేచెరువు గ్రామంలో వెలసిన కొల్లాపురమ్మ రథోత్సవ కార్యక్రమం బుధవారం జరగనుంది. బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఇందులో పాల్గొనున్నట్లు మండల కన్వీనర్ సిద్ధలింగప్ప తెలిపారు.

హిందూపురంలో పేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

హిందూపురం అర్బన్: ప్రసిద్ధ శ్రీ పేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం మధ్యాహ్నం నిర్వహిస్తారని ఈఓ నరసింహమూర్తి పేర్కొన్నారు. భక్తులు భారీగా తరలిరావాలని కోరారు.

మిట్టబండ ఆంజనేయస్వామి రథోత్సవం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మిట్టబండ ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

హిందూపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణంలో వెలసిన పేట వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీవారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి 8గంటల ప్రాంతంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కొల్లాపురి మహాలక్ష్మీదేవి జాతర

అగళి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అగళి మండలం నరసంబుది గ్రామంలో మంగళవారం రత్నగిరి కొల్లాపురి మహాలక్ష్మీదేవి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. రత్నగిరి నుంచి మహాలక్ష్మీదేవిని తీసుకువచ్చి ఊరేగింపుగా చేసి అనంతరం గ్రామం నడిబొడ్డులో అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పెనుకొండ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీడీ సుధావరలక్ష్మి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగాయి. ప్రాజెక్ట్ పరిధిలోని పెనుకొండ, సోమందేపల్లి, హిందూపురం, మడకశిర, గుడిబండ మండలాల్లో 27అంగన్‌వాడీ పోస్టులు ఖాళీఉండగా, 55మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 46మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.మంజువాణి, సీడీపీఓలు శాంతలక్ష్మి, నాగమల్లీశ్వరి, రాజేశ్వరి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ సీజ్



సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

అగళి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణాటక సరిహద్దు ఉప్పర తొనసనపల్లి గ్రామ సమీపంలోని వంక నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున దాడిచేసి ఇసుక ట్రాక్టరు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఉప్పరపాళెంకు చెందిన పాత లింగయ్య ఎక్సకవేటర్ అగళి మండలం పిబ్యాడిడిగెర గ్రామానికి చెందిన కిరణ్ ట్రాక్టర్‌లోకి ఇసుకను అక్రమంగా వేస్తుండగా పట్టుకున్నారు. దీంతో ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్)

గోరంట్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండాలబండ వీధికి,చెందిన బొక్కసం శ్రీనివాసులు (30) అనారోగ్యంతో ఉరివేసుకుని మంగళవారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంజనప్పకు మారుడైన శ్రీనివాసులు కియా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మూత్రనాళం ఇన్‌ఫెక్షన్ కావడంతో కుటుంబ సభ్యులకు తెలపకుండా వైద్యం చేయించుకునేవాడు. ఎంతకీ వ్యాధి నయం కాకపోవడంతో ఆందోళనకులోనైన శ్రీనివాసులు సోమవారం అర్ధరాత్రి సెల్‌ఫోన్‌ద్వారా తండ్రికి తాను మరణిస్తున్నట్లు సమాచారం పంపి పట్టణ శివారులోని సొంత పశువుల పాక వద్దగల కానుగచెట్టుకు చీరతో ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాసులు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా, పశువులపాక సమీపంలో చెట్టుకు వెలాడుతూ కనిపించాడు. సీఐ శేఖర్ సంఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతుడి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండకు తరలించారు. మృతునికి భార్య సుకన్య, ఎనిమిది నెలల కుమారుడున్నారు. చేతికందిన కొడుకు కళ్లముందే దుర్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

సబ్‌జైలులో ఖైదీ మృతిపై నేడు ఆర్డీఓ విచారణ

హిందూపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): లేపాక్షి మండలం మద్దిపి గ్రామానికి చెందిన కదిరప్ప అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ బుధవారం విచారణ చేయనున్నారు. గత యేడాది నవంబర్ 21న కదిరప్ప హిందూపురం సబ్‌జైలులో అనారోగ్యంతో మృతిచెందిన విషయం విదితమే. అయితే బంధువులు అనామానాస్పద మృతిగా ఆరోపించడంతో జిల్లా కలెక్టర్ దీనిపై మెజిస్టీరియల్ దర్యాప్తుకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు విచారణ ప్రారంభం అవుతుంది. మృతిచెందిన వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం ఉంటే ప్రత్యక్షంగా పాల్గొని అఫిడవిట్ రూపంలో ఆర్డీఓకు తెలుపవచ్చని తహసీల్దార్ వెంకటేశ్ ఓ ప్రకటనలో తెలిపారు.